క్లుప్తంగా

అధికారులకు ఘన సన్మానం



కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి, విద్యుత్ లైన్ మ్యాన్‌లను అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రెండు రోజుల క్రితం గాలివాన బీభత్సానికి గ్రామంలోని పురాతన చెట్లు, కరెంట్ స్తంభాలు కూలి పోవడంతో గ్రామంలో అంధకారం ఏర్పడింది. అలాగే రోడ్లపై చెట్లు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వామినాథ్, విద్యుత్ లైన్‌మ్యాన్ సాయికుమార్ వెంటనే సమస్యలను పరిష్కరించారు. దీంతో గ్రామ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేసి ఘన సన్మానం చేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యాంజనేయులు

మాగనూర్(మక్తల్): లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ బీమా 2025–26కు సంబంధించి నూతన అధ్యక్షుడిగా సత్యాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అంజన ప్రసాద్, కోశాధికారిగా ఆడెం సత్యనారాయణతో పాటు మరికొందరి సభ్యులతో



నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఈ సందర్భంగా సత్యాంజనేయులు మాట్లాడుతూ.. తనను అధ్యక్షుడిగి ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు డీవీ చారి, జైపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, యాలాల వీరేశం, డాక్టర్ శ్రీరామ్, రమేష్‌రావు, రాజుల ఆశిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి



మాగనూర్ (మక్తల్): మక్తల్ మండల పరిధిలోని దాసర్‌దొడ్డి గ్రామ శివారులో గత నెల 26న రైతు కటికెల్లి వెంకటేష్ పొలం దగ్గర ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. దాదాపుగా ఇరవై రోజులు గడుస్తున్న విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో పసువులకు, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిపోయిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఉపాధిహామీ పనుల్లో పిల్లలను పెట్టుకోవద్దు

ఊట్కూరు: ఉపాధిహామీ పథకం పనుల్లో పిల్లలను నియమించుకుంటే చర్యలు తప్పవని బాలల సంరక్షణ విభాగం కోఆర్డినేటర్ సంతోష అన్నారు. శుక్రవారం నిడుగుర్తి గ్రామంలో ఉపాధి కూలీలకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. 14 సం.ల లోపు బాల బాలికలను పనుల్లో పెట్టుకోకూడదన్నారు. అలాగే 18 ఏళ్లలోపు పిల్లలకు వివాహాలు చేయడం నేరమన్నారు. పిల్లలు ఎవరైనా ఆపదలో ఉంటే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రవన్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో మరింత భద్రత

నారాయణపేట రూరల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని రూరల్ ఎస్సై రాయుడు అన్నారు. శుక్రవారం అప్పక్‌పల్లిలోని రూరల్ పీఎస్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దొంగతనాలు, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామపెద్దలు కృషి చేయాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శుక్రవారం రేచింతల శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తమకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ హరీశ్‌రెడ్డి, ఓనర్ నర్సింహారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

పల్లెలకు రాని బస్సులు

- ప్రజలకు తప్పని తిప్పలు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



వర్కూర్ గ్రామపంచాయతీ



ప్రైవేట్ వాహనం కోసం వేచిచూస్తున్న గ్రామస్తులు

మాగనూర్: రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాం కల్పిస్తామని అటూ ప్రజాప్రతినిధులు ఇటూ అధికారులు చెబుతున్న మాటలు నీటి మీద రాతలుగానే మారుతున్నాయి. నేటికీ మండలంలో అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు అంటే అతిశయోక్తి కాదు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఉన్న వర్కూర్ గ్రామంతో పాటు సమీప గ్రామాలకు ఇప్పటి వరకు బస్సు సౌకర్యం లేదు. బస్సుల కొరతతో ఈ గ్రామాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటో, టాటా ఏస్‌లో ఎక్కితే ప్రయాణికులు నిండే దాక వాహనం కదిలించకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అత్యవసర సమయంలో వాహనాన్ని అద్దెకు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం

ఆటోల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణం ప్రమాదం అని తెలిసినా ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయిసున్నట్లు తెలుపుతున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగుల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్ని సార్లు విన్నవించినా..



మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు గతంలో అనేక సార్లు విన్నవించాం. ఇప్పటి వరకు గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను నమ్ముకొని ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

– శివ, వర్కూర్

బస్సు సౌకర్యం కల్పించాలి



ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం గ్రామం నుంచి మాగనూర్, మక్తల్, నారాయణపేట లాంటి ప్రాంతాలకు వెళ్తుంటాం. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారాయి. దీంతో సమయంతో పాటు నగదు వృథా అవుతుంది. అధికారులు స్పందించి వర్కూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

– నర్సింహ, వర్కూర్

త్వరలోనే బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తాం



మాగనూర్ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తమ దృష్టికి తీసుకొచ్చారు. సర్వీసులు నడిపేలా తాము కూడా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అతి త్వరలో అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తాం.

– లావణ్య, డిపో మేనేజర్, నారాయణపేట

నూతన వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి అన్నారు. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకుంటున్న చర్యలకు నిరసనగా మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెపై కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం కొత్తపల్లి మండలంలోని భూనీడు, గొర్లోనిబాయి, దుప్పటి గట్టు, గోకుల్ నగర్, తిమ్మారెడ్డి పల్లి, ఎక్కామేడ్, మన్నాపూర్, కొత్తపల్లి, నిడ్జింత గ్రామాలలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమ్మెను విజయవంతం చేయండి



గోడ పత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

మాగనూర్: కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న తలపట్టిన జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సమ్మె గోడ పత్రికలను బస్టాండ్ చౌరస్తాలో విడుదల చేశారు. అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి కేంద్రం తమకు అనుకూలంగా తెచ్చుకున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ సమ్మెలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌కుమార్, పుంజనూర్ బాబు, నర్సింములు, బాలు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్‌కు బస్సుల సంఖ్య పెంచాలి



మరికల్: ఆత్మకూర్–మరికల్ మధ్య సరిపడా బస్సులు తిరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులు ఈ మార్గంలో నడిచేవి. అయితే 20 రోజుల నుంచి ఒకే బస్సును నడుపుతుండడంతో ఆత్మకూర్ వెళ్లే ప్రయాణికులు బస్సు కోసం 3 గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే బస్సు రాకపోకలు సాగిస్తుండడంతో బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు కుస్తీలు పడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు స్పందించి మరో రెండు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెగ్యులర్ వైద్య సిబ్బందిని నియమించాలి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ వైద్య సిబ్బందిని నియమించాలని సీపీఐ ఎంఎల్, పీవైఎల్ నాయకులు బి.రాము, కాశీనాథ్, సలీం డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. చుట్టుపక్కల 15 గ్రామాల నుంచి రోగులు చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి వస్తున్నారని, వారికి వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇక్కడి నుంచి డిప్యూటేషన్ పై పంపించిన 11 మంది సిబ్బందిని వెంటనే కోటకొండకు తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు తరగతి గదిలోకి నిత్య నూతనంగా వెళ్లాలని జిల్లా కలెక్టర్ శిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణకు ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో అమలు జరుగుతున్న మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో గుర్తించిన అంతరాలను పూరించడం, అభ్యసన ఫలితాలపై పూర్తి పట్టు సాధించే విధంగా రాష్ట్ర స్థాయిలో పొందిన శిక్షణను తరగతి గదికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. నేటి శిక్షణ కార్యక్రమాలు రాబోయే విద్యా సంవత్సరంలో తరగతి గదులలో ప్రతిబింబించాలన్నారు. ఈ మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బోధనలో సమూల మార్పులు తెచ్చి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం నారాయణపేట సీఐ శివ శంకర్ మాదక ద్రవ్యాలు వాటి నివారణ గురించి ఉపాధ్యాయులకు వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మక్తల్ సీఐ రామ్‌లాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి సైబర్ క్రైమ్ గురించి పీపీటీల ద్వారా ఉపాధ్యాయులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, కోర్సు పరిశీలకులు గద్వాల్ డీఈఓ మహమ్మద్ సిరాజ్, సీఎంఓ రాజేంద్రకుమార్, ఏఎంఓ విద్యాసాగర్, బాలాజీ, బాలకిష్టప్ప పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సామగ్రి వితరణ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయానికి శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి 50 తులాల వెండితో చేయించిన శఠగోపం, స్థాలి, ఉద్ధరిని, అరివేని పాత్రను వితరణ చేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు వెండి సామగ్రిని వితరణ చేశారు.

'విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం నేర్పాలి'

అమరచింత: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు సమాజంలో ఎదుటివారిని గౌరవించే సంప్రదాయాలు, సంస్కారం నేర్పించినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం చదువే కాకుండా నిత్యజీవితంలో బతకడం ఎలా అన్న విషయాలను సైతం విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. మారుతున్న కాలంలో విద్యార్థులకు చక్కటి అలవాట్లతో పాటు సంస్కారం నేర్పించేందుకు వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి శిక్షణ శిబిరాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ కళలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తితో పాటు అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేసే విధంగా తీర్చిదిద్దేందుకు అక్షరవనం ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని 7 జిల్లాలో వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శృతి లయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, జోనల్ ఇన్‌చార్జ్ బాలకృష్ణ, రామేశ్వరమ్మ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

ఆత్మకూర్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఎంపీ రామన్ హైస్కూల్ విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సంస్కృతి 491, అభిగ్నసత్య 484, శ్రీరాంరెడ్డి 483, రాంచరణ్ 481, హర్షిత్ 480, కార్తీక్‌రెడ్డి 480, నవదీప్ 480, నరేష్ 479, పవన్‌రెడ్డి 477, నవదీప్ 475, ప్రసన్న 475, సందీప్‌రెడ్డి 474 ని సన్మానించారు. ఇలాగే కష్టపడి చదివి ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు.

'సురక్షిత ప్రయాణం చేద్దాం'

ఆత్మకూర్: సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ఇంటి క్షేమంగా చేరుకుంటామని, వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనదారులు, ప్రయానికులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్లు ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, హెచ్‌సీలు బాలీశ్వర్‌రెడ్డి, రవీందర్, సిబ్బంది బాలరాజు, రమేష్, రామకృష్ణ, గుప్త, రాములు, వాహనదారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పరిసరాల శుభ్రతతో డెంగీ దూరం: కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం నుంచి కలెక్టర్ సిక్తాపట్నాయక్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు నినాదాలు చేస్తూ ప్రధాన రహదారి గుండా వీర సావర్కార్ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జయచంద్రమోహన్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ డెంగీ వ్యాధి లక్షణాలను, చికిత్స విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు నర్సింహరావు, సంబంధిత అధికారులు గోవిందరాజులు, విజయ్‌కుమార్, శ్రీనివాస్, గోవింద్‌రావు, శంకర్, చంద్రశేఖర్, బాలశేఖర్, తబితరాణి పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అప్రమత్తత అవసరం

మాగనూర్: మండల కేంద్రమైన మాగనూర్‌లో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సం సందర్భంగా బస్టాండ్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు అఫ్రోజ్, నాగజ్యోతి మాట్లాడుతూ.. దోమలు కుట్టడం వలన డెంగీ వ్యాపిస్తుందని, దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి తేజస్విని, సూపర్‌వైజర్‌లు వెంకటేష్‌గౌడ్, యాదమ్మ, ఫార్మసిస్ట్ రాఘవేందర్, ల్యాబ్ టెక్నిసియన్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

దామరగిద్ద: దోమకాటు వల్ల కలిగే డెంగీ, మలేరియా, ఫైలేరియాసిస్ వంటి వ్యాధుల నివారణకు అవగాహన తప్పనిసరని డాక్టర్ శ్రావణి, సూపర్‌వైజర్‌లు వెంకటేష్, కిష్టమ్మ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ వెంకట్రామరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

మరికల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశా, ఏఎన్‌ఎం కార్యకర్తలు డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మరికల్‌లోని చౌరస్తాలో వ్యాధి నిర్మూలనకు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మాగనూర్ (మక్తల్): ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని వైద్యులు అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మక్తల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి వ్యాపించే విధానం, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని డాక్టర్ సంతోషి అన్నారు. శుక్రవారం ఊట్కూరులో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా డెంగీ వ్యాధి వ్యాప్తి, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతతో దోమలను నివారిస్తే డెంగీ వ్యాధి రాకుండా చూడొచ్చని సూచించారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ డెంగీని తరిమికొట్టాలని సీహెచ్‌ఓ రామయ్య తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వైద్య సిబ్బంది పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. దోమలతోనే డెంగీ వ్యాపిస్తుందని దోమల నివారణకు ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.



మక్తల్‌లో డెంగీపై ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు

బాలల హక్కులపై అవగాహన

మద్దూరు: మండలంలోని హన్మనాయక్ తాండ పరిధిలోని సల్లోనిగడ్డ తాండలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ, బాలల హక్కుల సమితి ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో కలిగే అనార్థాలు అలాగే బాలల హక్కులపై జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. బడి మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని సూచించారు. బాలలపై దాడులు, హింసకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయన్నారు. అలాగే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండవాసులు లక్ష్మణ్‌నాయక్, అనిల్‌నాయక్, దేశ్యానాయక్, మోతిలాల్, వెంకట్, రాములు పాల్గొన్నారు.



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

మైనర్లు వాహనాలు నడపొద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ కురుమయ్య

నర్వ: మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నర్వ ఎస్‌ఐ కురుమయ్య హెచ్చరించారు. శుక్రవారం కల్వాల్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారులను ఆపి డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ సరిగా లేకపోయినా, మద్యం తాగి వాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. అందరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు.

హజ్ యాత్రికులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు

నారాయణపేట: నారాయణపేట పట్టణం నుంచి హజ్ యాత్ర కోసం మక్కాకు బయలుదేరిన యాత్రికులకు డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి వీడ్కోలు పలికారు. ముందుగా స్థానిక తఖిబాబా దర్గాలో హజ్‌యాత్రకు బయలు దేరిన భక్తులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత వారిని కాంగ్రెస్ పార్టీ తరపున శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర మక్కాలో నారాయణపేట ప్రాంత అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని సూచించారు. అనంతరం అడిషనల్ ఎస్పీతో కలసి జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండీ సలీం, నాయకులు నవాజ్ ముసా, నాయకులు యూసుఫ్‌తాజ్, మహిమూద్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.



హజ్‌యాత్రికులను సన్మానించిన కుంభం శివకుమార్‌రెడ్డి